క్లుప్తంగా

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ

ముదిగొండ: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. మండలంలోని గోకినేపల్లిలో గురువారం సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, సర్పంచ్ గుగులోత్ క్రాంతి, మీగడ శ్రీనివాసయాదవ్, కొమ్మినేని రమేష్‌బాబు, బాబునాయక్ లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏన్కూరు: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎస్కే లాల్‌మియా తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వెంకటేశ్వర్లు, లకావత్ బొజ్జ శ్రీను పాల్గొన్నారు.

బోనాల జాతర

ముదిగొండ: మండలంలోని బాణాపురంలో పాండవులు, పెద్దమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం బోనాల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఫొటో గ్రాఫర్‌కు ఆర్థిక సాయం

వైరా: వైరా శాంతినగర్‌కు చెందిన ఫొటో గ్రాఫర్ పమ్మి రాజు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని వైరా లయన్స్‌క్లబ్ సభ్యులు గురువారం రూ.16 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నగదుని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, వీడీజీ–2 నంబూరి మధు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, వెంకటయ్య, చక్రవర్తి, శేఖర్‌బాబు, శ్యాంబాబు, సునీత, ప్రభాకర్, రమేష్, విశ్వేశ్వరరావు, వాసు, సత్యంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆశీర్వాదం, భద్రరాజు

తల్లాడ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తల్లాడలో గురువారం చలివేంద్రాన్ని రిధీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తెలంగాణా ఉద్యమ కారుల ఫోరం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోదుగు ఆశీర్వాదం, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి, ఫాస్టర్ తిమోతి, మేడి బసవయ్య, గోపిగౌడ్ పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకానికి సింగరాయపాలెం ఎంపిక



సింగరాయపాలెం ఉన్నత పాఠశాల

కొణిజర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం శ్రీ పథకానికి కొణిజర్ల మండలం నుంచి సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మరుగుదొడ్లు, గ్రంథాలయం, విద్యుత్, ప్లాస్టిక్ రహిత పాఠశాల, శుద్ధ జలం, ఐసీటీ ల్యాబ్, క్రీడలు, ఆరోగ్యం, వృత్తి విద్యా కోర్సులు తదితర వాటి కోసం మంజూరయ్యే నిధులు వాడుకోవచ్చని సూచించారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా స్కూల్ దశ నుంచే విద్యార్థులకు స్వయం ఉపాధిపై అవగాహన కలిపించడానికి ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

అందని.. ఆసరా!



పెన్షన్ కోసం నెలలుగా ఎదురుచూపులు

- అర్హత ఉన్నా చేయూతనివ్వని ప్రభుత్వం
- మండలంలో పలువురి ఇక్కట్లు
- 'డబుల్' పేరిట ఉన్న పింఛన్లు తొలగింపు

సత్తుపల్లిరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో పలువురు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా రెండేళ్లుగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు అందుతున్నా ప్రభుత్వం మంజూరు చేయడంలేదు. చివరకు సీఎం కేసీఆర్ గతేడాది ఆగస్టు నెలలో నూతన ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించటంతో దరఖాస్తుదారుల్లో ఆనందం నెలకొంది. అయితే ఈ నిర్ణయం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు మాత్రం పలువురిలో నిరాశనే మిగిల్చాయి. అధికారుల పర్యవేక్షణాలోపంతో అర్హులైన కొందరు దివ్యాంగులకు కార్డులు మంజూరైనా ఇప్పటికీ నగదు అందలేదు. దీంతో ఏడు నెలలుగా వారు కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోతున్నారు.

వెల్లువలా దరఖాస్తులు..

సత్తుపల్లి మండలంలో పింఛన్ల మంజూరు కోసం జనవరిలో 41 దరఖాస్తులు అందాయి. ఇక ఫిబ్రవరిలో ఏడు, మార్చిలో ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశామని మండల పరిషత్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఏప్రిల్ నెల నుంచి పింఛన్లు జమ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆతర్వాత కూడా పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందినా ప్రభుత్వం ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేయడంతో ఇంకా సుమారు 500పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

సమస్యల్లో కొన్ని...

- మండలంలోని చెరుకుపల్లి పంచాయతీకి చెందిన కుంజా పోతురాజుకు వృధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఇదే ఇంటి పేరుతో ఉన్న కుంజా భూషణమ్మకు అప్పటికే పింఛన్ వస్తోంది. వీరిద్దరి ఇంటి పేర్లు ఒకటే అయినా కుటుంబాలు మాత్రం వేర్వేరు. అయినప్పటికీ అధికారులు భూషణమ్మ పింఛన్‌ను రద్దు చేయడమే కాక పోతురాజు దరఖాస్తును పక్కన పడేశారు. దీంతో ఇద్దరు అర్హులు నష్టపోయినట్లయింది.
- మండల పరిధిలోని బుగ్గపాడుకు చెందిన సరోజిని వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంది. అప్పటికే ఆమె భర్త వెంకటప్పయ్యకు వికలాంగ పెన్షన్ వస్తోంది. అయినప్పటికీ సరోజినికి పింఛన్ ఇచ్చే వెసలుబాటు ఉన్నా అధికారులు దరఖాస్తును పక్కన పెట్టారు.

కార్డు ఇచ్చారు.. డబ్బులు మరిచారు



నాకు పెన్షన్ మంజూరైనట్లు 2022 ఆగస్టు 12న మంజూరు పత్రం, కార్డు (కేహెచ్ఎంసీడీ 09155)ను అధికారులు అందజేశారు. అయినప్పటికీ ఎనిమిది నెలలుగా బ్యాంక్ ఖాతాలో పెన్షన్ జమ కావడంలేదు. ప్రతీనెల ఖాతా చూసుకోవడం, నగదు పడలేదని నిరాశ చెందడం సాధారణమైపోయింది.

– మొహమ్మద్ నస్రీన్, దివ్యాంగురాలు, తుంబూరు

బతికుండగానే చంపేశారు..



నేను బతికే ఉన్నా.. అయినప్పటికీ నా పేరు మీద మీ సేవా కేంద్రం నుంచి మరణ ధ్రువీకరణ పత్రం జారీ అయిందట. ఎవరు దరఖాస్తు చేశారో తెలియదు. కానీ దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నేను చనిపోయానని చెబుతూ దరఖాస్తు పక్కన పెట్టారు. రేషన్ బియ్యం కూడా నిలిచిపోయింది.

– గద్దల రాంబాబు, దివ్యాంగుడు, సిద్దారం

ఇంటింటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్..

ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ నాయకులు..



మామునూరులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు, కొత్తపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు బండారు నర్సింహారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసగిస్తూ పాలన చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మామునూరు సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావు, మండల నాయకులు దోమందుల వీరయ్య, కోటపాటి రంగారావు, దేవరకొండ శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, కంచర్ల వెంకటనర్సయ్య, కోటపాటి పూర్ణ, వరికూటి శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

భరణిపాడులో బీఆర్ఎస్ నాయకులు..



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు: ఈ నెల 29న వెంకటపురంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని భరణిపాడులో గురువారం పార్టీ నాయకులు వివిధ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో రూపొందించిన పత్రలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ సునీతవెంకటరెడ్డి, మండపాటి మహేశ్వరరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వైరా: ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ నారపోగు అరుణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. మొక్కజొన్నల ధర ప్రైవేట్ మార్కెట్‌లో రూ.2,600 నుంచి రూ.1,600కు పతనమైందన్నారు. దళారులు దందా కొనసాగకుండా ప్రభుత్వం మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు శరాబంధి, రామారావు, కృష్ణారావు, సుధీర్, నాగేశ్వరరావు, సంక్రాంతి నరసయ్య, పుష్పరాజ్యం, రహేనా, మజీద్ తదితరులు పాల్గొన్నారు.



వైరా: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం రైతు సంఘం నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా..

ఏన్కూరు: మండలంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలతో పాటు మండలంలో జరుగుతున్న పలు సమస్యలపై తహసీల్దార్ ఎస్కే ఖాసీంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.నాగేశ్వరరావు, బి.బాలాజీ, రేగళ్ల తిరుమలరావు, నవాబ్‌బేగ్, శ్రీనివాసరావు, లెనిన్, రాములు, వెంకటయ్య, చిన్న జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



అవగాహన కల్పిస్తున్న మధిర డిపో మేనేజర్ దేవదానం

వైరారూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం పేర్కొన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమంలో భాగంగా గురువారం తాటిపూడి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థకు అండగా నిలవాలన్నారు. దివ్యాంగులకు, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బస్సు పాస్‌లు అందజేస్తుందని గుర్తు చేశారు. శుభకార్యాలకు బస్సు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మన్నెం సత్యానందం, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకూ ఉద్యమం

సత్తుపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకూ ఉద్యమిస్తామని ఎంఎస్పీ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక విశ్వశాంతి పాఠశాలలో నిర్వహించిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ సత్తుపల్లి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వర్గీకరణ ద్వారా 52 కులాలకు సమన్యాయం జరుగుతుంది కానీ ఎస్సీ వర్గీకరణ ద్వారా 59 కులాలకు సమన్యాయం చేయడానికి రాజకీయ పార్టీలు ఎందుకు వెనకాడుతున్నాయని నిలదీశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తప్పిందని, రాబోయే రోజుల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పి మాదిగల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, తాళ్ల అర్జున్, ఎంఎస్పీ నాయకులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, గొల్లమందల ముత్తారావు, తడికమళ్ల దేవదాసు, కనకపూడి రవి, కలపాల ఏసు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు కాంగ్రెస్ నాయకుల నివాళి

చింతకాని: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గుండెపోటుతో మృతిచెందిన రేషన్ డీలర్ మండెపూడి రంగయ్య మృతదేహం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గురువారం నివాళులర్పించారు. దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లిన రంగయ్య బుధవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రంగయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు హుస్సేన్, కన్నెబోయిన గోపి, మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బందెల నాగార్జున్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు, అధికార ప్రతినిధులు కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్, నాయకులు తోటకూరి గోవిందరావు, అప్పారావు, కంచం కోటేశ్వరరావు, బొలకొండ రామారావు, తాళ్లూరి రమేష్ తదితరులు ఉన్నారు.

ఆలయాలకు పొంగులేటి విరాళం



విరాళం అందిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వేంసూరు: మండలంలోని కల్లురుగూడెం పంచాయతీ గొల్లగూడెం, చౌడవరం రామాలయాలకు ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం విరాళం అందించారు. కార్యక్రమంలో అట్లూరి సత్యనారాయణరెడ్డి, రావి సత్యనారాయణ, కనమతరెడ్డి రంగారెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

తల్లాడ పోలీసులను అభినందించిన ఏసీపీ

తల్లాడ: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల ఓ వివాహిత అదృశ్యమైన కేసును త్వరగా చేదించినందుకు తల్లాడ ఎస్సై సురేష్, కానిస్టేబుల్ బాలాజీని గురువారం వైరా ఏసీపీ రెహమాన్ అభినందించారు. ఓ వివాహిత మహిళ 20 రోజుల క్రితం తన భర్త, ఇద్దరు పిల్లలను వదిలేసి ఇంటినుంచి వెళ్లిపోయింది. కుంటుబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును త్వరగా చేదించినందుకు కానిస్టేబుల్‌కు క్యాష్ రివార్డును ఏసీపీ అందించి ఇద్దరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ సురేష్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురువారం సాయినాధుడికి ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో షేక్ మదార్‌సాహెబ్ – షబానా దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సఖినవీడులో ఆయుర్వేద వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట్‌లాల్

ఎర్రుపాలెం: మండలంలోని సఖినవీడు గ్రామంలో గురువారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు వ్యాధులతో బాధపడుతున్న 79 మంది రోగులకు డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, సర్పంచ్ యరమల భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సూరానేని రామకోటేశ్వరరావు, ఫార్మాసిస్టు శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటేశ్వరరెడ్డి, సాయిరెడ్డి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సత్తుపల్లిలోని తుంబూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన నిరుపేదలకు డబుల్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక పేదలను విస్మరించిందన్నారు. తుంబూరులోని 32వ సర్వే నంబరులో గల 25 ఎకరాల ప్రభుత్వ భూమి కొంతమంది ఆక్రమణతో ఉందని.. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఇళ్ల స్థలాలు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఇవ్వకుండే పేదలతో కలిసి ప్రభుత్వ భూములు ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి జాజిరి శ్రీను, ఎం.సత్యనారాయణ, మోరంపూడి పాండు, కుమారస్వామి, శ్రీనివాసరావు, యాలాద్రి, కృష్ణ, సామ్రాజ్యం, విష్ణు, కిషోర్, రాంబాబు, కుమారి, సాంబశివ పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు చెల్లించాలి

పెనుబల్లి : రైతులు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది వ్యవసాయ రుణాలను చెల్లించాలని పెనుబల్లి ఏపీజీవీబీ మేనేజర్ అన్సర్ అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపెంట రైతువేదికలో ఆ గ్రామ రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. లక్ష రూపాయల రుణానికి 7 శాతం వడ్డీ పడుతుందని ఏడాదిలోపు రుణం చెల్లిస్తే కేంద్రం 3 శాతం వడ్డీ చెల్లిస్తుందన్నారు. మిగిలిన 4 శాతం వడ్డీని రైతు చెల్లిస్తే సరిపోతుందన్నారు. రుణం తీసుకుని 5 సంవత్సరాల పాటు కట్టకుండా ఉంటే రూ.80 వేలకు పైగా వడ్డీ పడుతుందని, వీటికి అదనంగా బ్యాంక్ చార్జీలు కూడా ఉంటాయన్నారు. కావున రైతులు సకాలంలో తెలంగాణా పట్టా పాస్‌పుస్తకాలను తెచ్చుకొని రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ, బ్యాంక్ మిత్ర ఎస్కే రజియా, గ్రామ దీపిక పర్సా కృష్ణ , రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీజీవీబీ మేనేజర్ అన్సర్

పోషకాహారంతోనే చిన్నారుల్లో ఎదుగుదల



బాలామృతం ప్యాకెట్ అందజేస్తున్న దయామణి

ఏన్కూరు: పోషకాహారంతోనే చిన్నారుల్లో ఎదుగుదల ఆధారపడి ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో గురువారం బాలామృతం ప్లస్ ప్యాకెట్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలకు ప్రతి నెలా ఎత్తుకు తగ్గటుగా బరువు లేని పిల్లలను శ్యామ్‌మామ్‌గా గుర్తించి వారికి ఆకలి పరీక్ష చేసి.. పాస్ అయితే నేరుగా బాలామృతం ప్లస్ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, తహసీల్దార్ ఎస్‌కె.ఖాసీం, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం..

తల్లాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తల్లాడ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల అన్నారు. గురువారం తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో ముద్దునూరు క్లస్టర్‌లో అంగన్‌వాడీ టీచర్లతో హెల్త్ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన కుర్నవల్లి సర్పంచ్ ఐలూరి లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, వెంకటేశ్వరమ్మ, జ్యోతి, అచ్చమాంబ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు పంపిణీ



కూలీలకు మెడికల్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్, రాగమయి దంపతులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గవాగు గ్రామీణ ఉపాధి కూలీలను డాక్టర్ మట్టా దయానంద్, రాగమయి దంపతులు కలిశారు. వారికి ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా గురువారం 100 మందికి 'ఉపాధి'లకు మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ.. ఆనాటి నుంచే నా తల్లిదండ్రులు డాక్టర్ మట్టా కృష్ణమూర్తి, ఆరోగ్యంలు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వైరా: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఈనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైరా 13వ వార్డుకు చెందిన కాల్వ వెంకటేశ్వర్లు(60) పాత బస్టాండ్ సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ ఢీకొని గేదె మృతి

కారేపల్లి: లారీ ఢీకొనడంతో ఒక గేదె మృతి చెందగా, మరో మూడింటికి గాయాలయ్యాయి. మండలంలోని సీతారాంపురానికి చెందిన రామగిరి సతీష్‌కు చెందిన నాలుగు గేదెలు మేతకు వెళ్లి గురువారం రాత్రి ఇంటికి వస్తున్న క్రమంలో ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఒక గేదె మృతి చెందగా, మిగిలిన వాటికి గాయాలయ్యాయి.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కారేపల్లి: భార్యతో గొడవపడిన భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై కారేపల్లి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. కారేపల్లి బీసీ కాలనీకి చెందిన రావుల నరసింహారావు(32) ఈనెల 24వ తేదీన భార్య లక్ష్మితో గొడవ పడి అదే రోజు వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేక పోవడంతో ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రామారావు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై..

కల్లూరు: మండలంలోని మర్లపాడుకు మహిళను వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావుపై కేసు నమోదైంది. సదరు మహిళను వెంకటేశ్వరరావు కొంతకాలంగా వేధిస్తుండడంతో ఆమె కుటుంబీకులు గురువారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రఘు తెలిపారు.

సర్పంచ్‌లు లేని సమావేశాలెందుకు..?

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం

ఏన్కూరు: సర్పంచ్‌లు లేని సమావేశాలు ఎందుకు.. గ్రామాల్లో సమస్యలు చర్చించేందుకు సర్పంచ్‌లు రాకపోవడం ఏమిటని తిమ్మారావు పేట ఎంపీటీసీ గుగులోత్ లచ్చిరాం నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి గురువారం మండలంలోని 25 పంచాయతీల్లోని సర్పంచ్‌లు ఒక్కరు కూడా హాజరుకాలేదు. సమావేశానికి తిమ్మారావు పేట, జన్నారం, బురదరాఘవాపురం, శ్రీరాంగిరి ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, స్వర్ణ శిరీష, బానోత్ ప్రమీల, వాసిరెడ్డి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యుడు ఎస్కే నవాబ్‌బేగ్ హాజరయ్యారు. ఈ క్రమంలో అధికారులు నివేదిక చదువుతుండగా ఎంపీటీసీ లచ్చిరాం నాయక్ కలగజేసుకొని సర్పంచ్‌లు లేని సమావేశంలో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని అన్నారు. అనంతరం ఆయన కూడా వెళ్లిపోయాడు. దీంతో ఒక్కొక్కరుగా ఎంపీటీసీలందరూ, కోఆప్షన్ సభ్యుడు వెళ్లిపోయారు. దీంతో అధికారులు తమ నివేదికలు చదవడంతో సర్వసభ్య సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ, తహసీల్దార్ ఎస్కే ఖాసీం, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ లచ్చిరాం